క్లుప్తంగా

హుండీ సొమ్ము లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వరస్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఈఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో రూ.2,99,155 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లక్ష్యసాధనకు శ్రమించాలి


మాట్లాడుతున్న డాక్టర్ కునిగిరి కల్పన

పత్తికొండ రూరల్ : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని పత్తికొండ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కునిగిరి కల్పన అన్నారు. శుక్రవారం పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల ఆహారం, వ్యాయామం, ధ్యానం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మహిళాభివృద్ధి సెల్ కోఆర్డినేటర్ నీరజాక్షి, అధ్యాపకురాలు షంషాబీ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు రూపా మోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచా రి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


బోయ రామాంజనేయులు

వెల్దుర్తి: మండలంలోని లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు (46) శుక్రవారం పాముకాటుతో మృతిచెందాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. రామాంజనేయులు కూలీ పనులతో పాటు మామిడి పండ్ల వ్యాపారిగా జీవనం సాగించేవాడు. సంఘటన రోజు తెల్లవారుజామున కాలకృత్యాల నిమిత్తం బహిర్భూమికి వెళ్లి పాముకాటుకు గురయ్యాడు. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెల్దుర్తి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కంగాటి రామ్మోహన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


హొళగుంద జూనియర్ కాలేజీలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ సెకండియర్ పబ్లిక్ పరీక్షను సిట్టింగ్ స్క్వాడ్ లక్ష్మన్న తనిఖీ చేశారు. కేంద్రాల్లోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే తాగునీరు, వైద్యసేవలు, ఇతర సదుపాయాల ఏర్పాట్లపై ఆరా తీశారు. మొత్తం 169 మందికి గాను 166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు విలేకరులకు తెలిపారు. మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షలనిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారని పరీక్షా కేంద్రం చీఫ్ ప్రవీణ తెలిపారు.

24న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామంలో ఈ నెల 24వ తేదీన భీమలింగేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాయి,గోవ,భాస్కర్,మధు,శ్రీను, మాజీ సర్పంచ్ భీమలింగ తదితరులు శుక్రవారం తెలిపారు.వారు మాట్లాడుతూ పాల్గొనే జట్లు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా..రూ 50వేలు, రూ.30వేలు అందజేస్తామని చెప్పారు.

- అజాగ్రత్త, నిర్లక్ష్యంతో అగ్ని ప్రమాదాలు
- రెండేళ్లలో 107 ఫైర్ కాల్స్.. రూ.78 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న ఫైర్ అధికారులు

గూళ్యంలో దగ్ధమవుతున్న గడ్డివాములు (ఫైల్)


నిప్పు..ముప్పు!


ఇటీవల బల్లూరులో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన గడ్డివాములు

ఆలూరు రూరల్: వేసవి ప్రారంభమైంది. గ్రామాల్లో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాల ఘటనలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగరెట్, బీడీ కాల్చి ఆర్పివేయకుండా పడివేయడం వల్ల చాలా చోట్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే.. మనిషి అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలే ఎక్కువని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు. ఎండాకాలంలో అజాగ్రత్తగా ఉంటే అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలు పాటిస్తే వాటిని అరికట్ట వచ్చని, ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఆలూరు అగ్నిమాపక, విపత్తుల నివారణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

రెండేళ్లలో 107 ఫైర్ కాల్స్..

2023–24వ సంవత్సరంలో ఆలూరు అగ్నిమాపక పరిధిలో 70 ఫైర్ కాల్ రాగా రూ.35,83,000 లక్షల ఆస్తి నష్టం వాటిల్లగా అగ్నిమాపక అధికారులు మంటలార్పి రూ.1.94 కోట్ల ఆస్తి నష్టాన్ని నివారించారు. 2024–25లో ఇప్పటి వరకు 37 ఫైర్ కాల్స్ వచ్చినట్లు ఫైర్ అధికారులు వెల్లడించారు. అగ్ని ప్రమాదాల్లో రూ.33,15,000 ఆస్తి నష్టం కాగా, రూ.1.54 కోట్ల నష్టాన్ని నివారించారు.

అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా పాటించాల్సిన జాగ్రత్తలు..

- వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి.
- ఇంటి తలుపు మూసి వెళ్లిన వచ్చిన వారు గ్యాస్ వాసన వస్తే లైట్లు ఆర్పివేయడం, వేయడం వంటివి చేయకుండా అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలి.
- సిగరెట్, బీడీ ,చుట్టా వెలిగించిన వారు తాగిన వెంటనే పూర్తిగా ఆర్పివేయాలి.
- వేసవిలో ఇళ్లను వదిలి వెళ్లేవారు ముఖ్యంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి వెళ్లాలి. దీంతో వేడికి వైర్లు షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి సరఫరా కాకుండా ఉంటుంది.
- వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి.అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన్ దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.
- అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇంటి తలుపులు మూసి అగ్ని మాపక కేంద్రానికి సమా చారం ఇవ్వాలి. లేదా 101కు కాల్ చేయాలి.
- అగ్ని ప్రమాదం వల్ల అతిగా పొగ వెలువడి ఊపిరాడక పోతే.. మంటలను నుంచి తప్పించుకోవడానికి నేలమట్టానికి తాకుతూ ముందుకు వెళ్లాలి. దీని వల్ల ప్రమాదం తీవ్రత తగ్గుతుంది.


ఆలూరులోని అగ్నిమాపక కేంద్రం

అప్రమత్తంగా ఉండాలి



వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తాయి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో బీడీ,సిగరెట్ కాల్చే వారు వాటిని పూర్తిగా ఆర్పివేయాలి. ఇళ్లలో మహిళలు నిర్లక్ష్యంగా ఉండరాదు.అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ అధికారులకు సమాచారం అందించాలి.
– ఖాద్రి,అగ్నిమాపక అధికారి,ఆలూరు

నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యం


మాట్లాడుతున్న హనుమంతరావు

తుగ్గలి : గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని రోళ్లపాడుతండాలో శుక్రవారం సాయంత్రం నవోదయం 2.0పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. ఆదాయం కోసం నాటుసారా తయారు చేస్తున్నారే తప్ప, ఇతరుల ఆరోగ్యంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్న వాస్తవాన్ని గ్రహించడం లేదన్నారు. ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు సరఫరా జరుగుతున్నా టోల్‌ఫ్రీ నంబర్ 14405కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం సారాకు దూరంగా ఉంటామని తండావాసులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయి ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కక్షపూరితంగానే దివ్యాంగుల పింఛన్ల తొలగింపు


మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ఓ వైపు దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తూ మరో వైపు దివ్యాంగుల పింఛన్ పెంచామని ఇది మా బ్రాండ్ అని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 75 వేల మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించారన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతి నెల అర్హులైన దివ్యాంగులకు ఫింఛన్ మంజూరు చేసిందన్నారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ మల్లేష్ నాయక్ నాయకులు వీరేష్, ఈరన్న ఉన్నారు.

అంత్యక్రియలకు వెళ్లివస్తూ..


చికిత్స పొందుతున్న బాధితుడు

పత్తికొండ రూరల్ : అత్త అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మండలంలోని పత్తికొండ- చందోలి దారిలో శుక్రవారం రాత్రి ఆటో–బైక్ ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు తండావాసులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలు..పెండ్లిమాన్‌తండాకు చెందిన వృద్ధురాలు నారమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు బంధువులైన గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన సామానాయక్, భీమానాయక్, రాజునాయక్ ఒకే బైక్‌పై పెండ్లిమాన్‌తండాకు వచ్చారు. అంత్యక్రియలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి ఒకే బైక్‌లో బయల్దేరారు. ప్రమాదవశాత్తు ఆటో–బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ బోల్తా పడి ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ఫార్మర్ ఐడీ నమోదు చేయించుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్

దేవనకొండ: భూములు కలిగిన ప్రతి రైతు ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు చేసుకోవాలని ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ సురేష్ బాబు, వ్యవసాయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు ఫార్మర్ యూనిక్ ఐడీ కోసం 14,428 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇంకా 3 వేల మంది రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకం కింద 430 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోకపోవడం వల్ల పీఎం కిసాన్ డబ్బులు పడలేదన్నారు. ఏఈఓలు రంగన్న, మల్లికార్జున, అబ్దుల్‌సలాం, వీపీఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

పొలాల్లో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, రైతులు

వెల్దుర్తి: మండలంలోని సూదేపల్లె గ్రామానికి చెందిన రైతుల పొలాల్లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించి నష్టాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన రమణారెడ్డి, పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడం గమనించిన రైతులు, చుట్టుపక్కల వారు మంటలనార్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో డోన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అంతలోగా రమణారెడ్డి పొలంలోని మునగపంట, డ్రిప్ పరికరాలు, మోటార్లు, స్టార్టర్ బాక్సులు అగ్నికి ఆహుతయ్యాయి. పుల్లారెడ్డి, భూమిరెడ్డి సోదరుల పొలంలోని మూడు ట్రాక్టర్ల సొప్ప, ఒక ట్రాక్టరు గడ్డివాము, రెండు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైరు కాలిపోయాయి. సంఘటనాస్థలికి చేరుకున్న డోన్ అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ తన సిబ్బందితో కలిసి మంటలను పూర్తిగా ఆర్పేశారు. దాదాపు రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు.

రేషన్ సకాలంలో అందజేయాలి

మద్దికెర : లబ్ధిదారులకు రేషన్ సకాలంలో సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నిత్యావసర వస్తువులు అందలేదని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరుకుల పంపిణీని గ్రామాల్లో సంబంధిత వీఆర్వోలు పర్యవేక్షిస్తుండాలని చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందించాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మద్దికెర : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. వాహనాలకు సంబంధించి రికార్డులు వద్ద ఉంచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, తరువాతి పరిణామాలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు.

వైద్యులకు సన్మానం

తుగ్గలి : ఉన్నత చదువుల కోసం వెళ్తున్న స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ప్రవీణ కుమార్, ప్రతిమను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రఘురామిరెడ్డి హాజరై వైద్యుల సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలు, శాలువాతో వైద్యులను సన్మానించారు.

బాల్య వివాహాలతో ఆరోగ్యానికి ముప్పు

మద్దికెర : బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో బాల్య వివాహాలకు సంబంధించి పోస్టర్లను చూపి జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా ఉన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ సుంకులాంబదేవి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు, నిర్వహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన పెరుగు అన్నం సమర్పించి, చలువ బిందెలతో ఆలయాన్ని భక్తులు సందర్శించి మొక్కులను చెల్లించుకోనున్నారని చెప్పారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


మహాలక్ష్మి(ఫైల్)

హొళగుంద: పెద్దహ్యాట గ్రామానికి చెందిన మహాలక్ష్మి (35) అనే వివాహిత శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగేళ్లగా పెరాలసిస్‌తో బాధ పడుతుండగా ఇటీవల సమస్య తీవ్రం కావడంతో మనో వేదనతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. మృతురాలికి భర్త సోమన్నగౌడ్, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం నిశ్చయ మైనట్లు సమాచారం. పెద్ద కుమార్తె వీణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

టీకాలతో పశువులకు మేలు


మల్లెపల్లెలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీడీ దుర్గాప్రసన్న బాబు

వెల్దుర్తి: గాలికుంటు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలుగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ కర్నూలు డీడీ దుర్గాప్రసన్న బాబు కోరారు. శుక్రవారం మండలంలోని మల్లెపల్లె గ్రామంలో వెల్దుర్తి పశు వైద్యాధికారి శాంతలత ఆధ్వర్యంలో ఆవులు, గేదెలు, ఎద్దులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జనవరి నుంచి ఏప్రిల్ మధ్యలో ఎక్కువగా సోకే గాలికుంటు వ్యాధిని సోకిన పశువులను ముందే గుర్తించి చికిత్స చేయించాలన్నారు. మందులు ఇస్తూ తేలికగా జీర్ణమయ్యే ఆహారమివ్వాలన్నారు. వైరస్ ప్రబలకుండా మంద నుంచి దూరం చేయాలన్నారు. ఏహెచ్‌ఏ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కృష్ణగిరి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ దుర్గా ప్రసన్నబాబు రైతులకు సూచించారు. శుక్రవారం కృష్ణగిరి, కోయిలకొండ గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ టీకా కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. కృష్ణగిరి పశువైద్యాధికారి నవీన్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పని వేళల్లో మార్పులు

చిప్పగిరి:పెరిగిన ఎండల తీవ్రత కారణంగా ఉపాధి హామీ పనివేళల్లో మార్పులు చేసినట్లు ఏపీఓ జుబేర్, అహ్మద్ శుక్రవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 11 గంటలకు ముగించాలని చెప్పారు. మండలంలోని ఏఫ్ఏలు ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత ఎక్కువ ఉన్నందున కూలీల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని చెప్పారు. అవసరమైతే సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పని చేసుకోవడానికి కూడా అవకాశం ఉందని తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా!


జొన్నగిరి సమీపంలో మలుపు రోడ్డుపై ప్రమాదకరంగా గుంత


గుంతను తప్పించబోయి బోల్తాపడిన ప్రైవేటు బస్సు(ఫైల్)

తుగ్గలి : సంక్రాంతి పాయే..శివరాత్రి పాయే..సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఆ తర్వాత శివరాత్రి పండుగకంతా రోడ్ల మరమ్మతులు ఉండకూడదన్నారు. అది కూడా పాయే.. పత్తికొండ నుంచి చెర్వుతండా వరకు రోడ్డు మరమ్మతులకు రూ.13లక్షలు మంజూరయ్యాయి. పలుచోట్ల పైపైపూత పూసి మమ అనిపించారు. నిత్యం రద్దీగా ఉండే పత్తికొండ–గుత్తి ప్రధాన రహదారి మార్గంలో జొన్నగిరి వద్ద ఓ మలుపులో రోడ్డుపై గుంత పడి ప్రమాదకరంగా మారింది. గుంతను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురై వాహనదారులు, ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. గత నెల 21న మంత్రాలయం నుంచి అనంతపురం వైపు యాత్రికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సు మలుపులో గుంతను తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. రోడ్డుపై పడిన గుంతను పూడ్చక పోవడం వల్లే బస్సు బోల్తా పడింది. ఘటన స్థలాన్ని పలువురు అధికారులు కూడా పరిశీలించారు. అయినా ఇంతవరకు గుంతను పూడ్చకపోవడం గమనార్హం. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రమకుమార్‌ను సంప్రదించగా రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేస్తామన్నారు. రెండు సార్లు మరమ్మతులు చేసినా మలుపులో వాహనాల బ్రేకులకు నిలబడలేదన్నారు. అక్కడ సీసీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నివాళి

కృష్ణగిరి: మండలంలోని జి. మల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ గొర్ల రోగెన్న (58) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, డిష్ వెంకటేష్, కరివేముల వెంకటేష్ తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

దేవనకొండ: కప్పట్రాళ్ల గ్రామ ఎంపీపీ పాఠశాలలో ఈనెల 9వ తేదీన కర్నూలు సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సభ్యులు శుక్రవారం తెలిపారు. డాక్టర్లు రవిబాబు, శృతి, మల్లేశ్వరి, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, నాగరాజు పాల్గొని రోగులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారు చికిత్స పొందవచ్చని చెప్పారు.

- పాల దిగుబడిపై ప్రభావం
- రైతులు జాగ్రత్తలు పాటించాలి

పశువులకూ వేసవి గండం


చిట్యాల సమీపంలో ఎండలో మేస్తున్న గేదెలు

కృష్ణగిరి: వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మనుషులకే కాకండా పశువులకు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికే ఎండల తీవ్రత పెరుగుతుండటంతో మూగ జీవాలు విలవిల్లాడుతున్నాయి. మండలంలో వ్యవసాయం తరువాత చాలా గ్రామాల్లో పాడి పరిశ్రమకే రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం అవుతుండటంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత రెండేళ్లుగా సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో పంటలు లేక రైతులు కరువుతో అల్లాడుతున్నారు. దీంతో పశువులకు కూడా పశుగ్రాసం అందించడం రైతులకు భారంగా మారింది. పశువుల దాణా, గ్రాసం అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. మండల వ్యాప్తంగా 9,534 ఆవులు, 6,826 గేదెలు, 97,578 గొర్రెలు, 6వేల మేకలు ఉన్నాయి. వేసవి తీవ్రత ఆవుల కంటే బర్రెలపై అధికంగా ఉంటుంది. వేసవి ముగిసే వరకు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని కృష్ణగిరి పశువైద్య అధికారి డాక్టర్ నవీన్ సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకెళ్లాలి. ఎండలో మేపకపోవడం మంచిది.
- పశుగ్రాసం ఉన్న పాకల్లో ఉంచుతూ చుట్టూ నీడనిచ్చే చెట్లను పెంచాలి.
- ఉష్ణోగ్రతలను అదుపు చేసేందుకు వీలుగా పాకల చుట్టూ తడిపిన గోనె సంచులను కట్టాలి.
- పాకలు లేని చోట చెట్ల కింద సేద తీర్చాలి.
- ప్రతి రోజు వీలైనంత వరకు పచ్చిగడ్డి అందించాలి.
- రోజుకు 60 నుంచి 70 లీటర్ల నీళ్లు తాగుతాయి కనుక నీళ్లు అందుబాటులో ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతకు గురయ్యే పశువులు తల, శరీర భాగాలను నీటితో తడపాలి. ఉష్ణతాపానికి గురయ్యే బర్రెల ద్వారా 20 శాతం పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది.